క్లుప్తంగా

16న మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సమావేశంలో పలు అంశాలపై సమీక్షిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

జైభీమ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వీరబాబు



ఏలేశ్వరం: జైభీమ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దాడిశెట్టి వీరబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందినట్టు వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గ కన్వీనర్‌గా ఉన్న తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. వీరబాబు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

ఏలేశ్వరం: పెద్దాపురం మండలం జి.రాగంపేట ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో ఏడుగురు మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక వినోద్ మిశ్రానగర్‌లో శుక్రవారం మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.రాగంపేట దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, కందుల వరలక్ష్మి, సుబ్బలక్ష్మి, జి.వరలక్ష్మి, గుమ్మడి పాదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా లలిత



తొండంగి: స్థానిక పశువైద్యాధికారిగా ఎం.లలిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని బెండపూడి పశువైద్యాధికారిగా పని చేస్తున్న బి.చైతన్య ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు లలితను పశువైద్యాధికారిగా నియమించడంతో ఆమె విధుల్లో చేరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా విద్యా సంస్థల ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మినర్వా అధినేత డీవీఎస్ రమేష్‌రాజు ప్రారంభించారు. విద్యార్థులు, రోగులకు చిల్డ్రన్స్ స్పెషలిస్టు ఇందన రఘురామ్, గైనకాలజిస్టు శారదాదేవి, ధర్మవరం అంజు కంటి ఆసుపత్రి వైద్యులు శ్రద్ధ, రేష్మ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మినర్వా అకడమిక్ డైరెక్టర్ ఆర్బీ చౌదరి, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ హరిబాబు, జోషి, హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14 నుంచి ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన

కాకినాడ సిటీ: జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 19వతేదీ వరకు కాకినాడ దేవాలయం వీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి కె పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. ఈ ప్రదర్శనను ఈ నెల 14న కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కాటన్, మెర్సిడైజ్డ్, టై అండ్ డై చీరలు, సీకో చీరలు, మాధవరం, వెంకటగిరి జరీ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్, ఉప్పాడ జాంధాని చీరలు, కాటన్ షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పొందూరు ఖద్దరు, పెద్దాపురం సిల్క్ షర్టింగ్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు ప్రఖ్యాతి గాంచిన బెడ్ షీట్స్, పేరెన్నిక గన్న ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రం నలుమూలల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 30 చేనేత సహకార సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొంటున్నారని పెద్దిరాజు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని, చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచామన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఎస్ఎస్ పట్నంలో గడపగడపకూ..



ఎస్ఎస్ పట్నంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: పేదల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్ఎస్ పట్నంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల వైఎస్ ఎంపీపీ వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మితో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామస్తులు డ్రైన్లు, వీధిరోడ్లు, తాగునీరు, ఇళ్ల పట్టాలు, పింఛన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు యెనుముల కోటిబాబు, సైపురెడ్డి వెంకటరమణ, రాజవరం ఎంపీటీసీ సోమరౌతు నాని, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, అర్చకులు చిట్టెం వాసు, నగేష్, వ్రతపురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 22 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తలుపులమ్మతల్లికి మహాచండీహోమం

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారికి శుక్రవారం మహాచండీ హోమం నిర్వహించారు. వేద పండితులు శశాంక్ త్రిపాఠి, అర్చకులు ధూళిపాళ సాయి శ్రీనివాస శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.

జగనన్న పాల వెల్లువతో రైతులకు మేలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పశువైద్యాధికారి లలిత

తొండంగి: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల పశువైద్యాధికారి ఎం.లలిత అన్నారు. తొండంగి గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ సోమాల ప్రసాద్ అధ్యక్షతన జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా డైయిరీలు, సహకార సంఘాల ద్వారా పాలను సేకరిస్తుందన్నారు. ఈ కేంద్రాలకు పాలు సరఫరా చేసిన పాడి రైతులకు మార్కెట్ ధర కంటే రూ.4 నుంచి రూ.15 వరకూ (వెన్నశాతాన్ని బట్టి) ఎక్కువ చెల్లిస్తారన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీపై పశువుల దాణా, గడ్డి విత్తనాలు, గడ్డికోత(కటింగ్) యంత్రాలు అందిస్తోందన్నారు. పాడిరైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమూల్ ప్రతినిధి దస్తావరి, తొండంగి సొసైటీ అధ్యక్షుడు పెదిరెడ్ల సురేష్ పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

శంఖవరం: మేలైన అపరాల విత్తనాలను సాగు చేయటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తూర్పుగోదావరి జిల్లా ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరశింహరావు, ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని కత్తిపూడిలో రైతులు సాగు చేసిన మినుము, పెసర పంటలను శుక్రవారం వారు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కొన్ని కమతాల్లో మురుగునీటిని గుర్తించారు. మురుగు నీరు వలన పంట ఎదుగుదల తగ్గి చీడపీడల ఉధృతి పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో వరి పంటను పరిశీలించారు. కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులు ప్రకృతి వ్యవ సాయపై దృష్టి సారించాలన్నారు. అపరాలు సాగు చేసిన రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.గాంధీ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

12 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భూముల రీ సర్వే మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల్లో పూర్తయిందని మండల సర్వేయర్ నిరంజన్‌రావు శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 15 రెవెన్యూ గ్రామపంచాయతీలు ఉండగా ఏవీ నగరం, తొండంగి, కోన ఫారెస్ట్ మినహా మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. మార్చి 10 లోపు మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం ఏవీ నగరంలో సర్వే జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో సీహెచ్ రామకృష్ణదొర, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు గాయపడినయువకుడు

తుని: మండలంలోని తిమ్మాపురం రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి గాయపడిన యువకుడిని కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఒడిశాకు చెందిన దీపక్ (18) గురువారం అలెప్పీ నుంచి టాటానగర్ ధనాబాద్ వెళుతున్న బొకారో ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి గాయపడ్డాడు. క్షతగాత్రుడును 108 అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్వల్పగాయాలు కావడంతో బాధితుడు దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌తో కటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అప్పగించారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ



గోకవరంలో రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని పలువురు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు శుక్రవారం గోకవరంలో పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, స్నేహ లైఫ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 మందికి ఒక్కొక్కరికీ రూ. 500 విలువ గల పౌష్టికాహారం కిట్లును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అందజేశారు. వ్యాధిగ్రస్తులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో స్నేహ లైఫ్ కేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జగ్విందర్ సింగ్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ డీఆర్పీ రాజశేఖర్, సూపర్‌వైజర్ రామకృష్ణ, లింక్ వర్కర్ సూర్యకుమారి, లాజర్ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



ఏలూరులో లేగ దూడలను ప్రదర్శిస్తున్న పాడి రైతులు

ప్రత్తిపాడు: లేగ దూడల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రత్తిపాడు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని ఏలూరు రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బర్రే రామకృష్ణ, రంధి విష్ణుమూర్తి, సప్పా నరసింహమూర్తి లేగ దూడలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాడిశెట్టి చక్రధర్, జామి మాణిక్యం, పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డి.అంబేడ్కర్, వీఏఎస్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

గండేపల్లి: ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దాపురం ఏడీఏ ఎస్.దైవకుమార్ హెచ్చరించారు. మండలంలోని మల్లేపల్లి, తాళ్లూరు, గండేపల్లి గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించ రాదన్నారు. రైతులు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.80, 000 విలువైన ఎరువుల్లో అవకతవకలు జరిగినట్టు గుర్తించి అమ్మకాలు నిలిపివేసినట్టు తెలిపారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి ఎ. సద్దురు మూర్తి, జగ్గంపేట హబ్ మేనేజర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు శుక్రవారం బడ్జెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బీజేపీ స్టేట్ ఓబీసీ మోర్చ జోనల్ ఇంచార్జి వి.శ్రీనివాసరాజు బడ్జెట్‌ను ఎలా పరిశీలించాలి, అందులో ప్రధాన అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాట్ల కృష్ణ వర్మ, జగ్గంపేట మండల అధ్యక్షుడు మేక వీరబాబు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదశంకర్లపూడిలో శుక్రవారం సాయంత్రం బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. ఆర్టికల్ 370 రద్దు వల్ల జమ్మూ కశ్మీర్‌లో జూడో యాత్రలు, సమావేశాలు నిరభ్యంతరంగా జరుపుకుంటున్నారంటే ప్రధాని మోదీ వల్లనే సాధ్యమైందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సంసిద్ధులై ఉండాలని సూచించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు కందా వీరాస్వామి, విస్తారక్ ఈగల వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఈర్ల దేవి, బీజేపీ నాయకులు కర్రి ధర్మరాజు, దాకే కృష్ణారావు, పెట్లు కొండబాబు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



సిరిపురం శివాలయం వద్ద పందిరి రాట వేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట వేసి అంకురార్పణ చేశారు. తొలుత ఆలయ అర్చకుడు వై.రామకృష్ణమూర్తి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమార్తై, పెండ్లికుమారుడు చేయుట, 16న స్వామివారి కల్యాణం ,18న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, 19న గ్రామోత్సవం, పండిత సదస్యం, 20న త్రిశూల స్నానం, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా అడవిరాజులబాబు పండగ



తేటగుంటలో సీతాదేవి, లవకుశలు, వాల్మీకి విగ్రహాలు

తుని రూరల్: మండలంలోని తేటగుంట, డి.పోలవరం, ఎస్ఎస్‌వీ నగరం తదితర గ్రామాల్లో అడవిరాజులబాబు పండగ శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. తేటగుంట ఎగువవీధి ఆలయంలో సీతాదేవి, లవకుశలు, వాల్మీకీలకు గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడ్డెను ఊరేగింపుగా అడవిలోకి తీసుకువెళ్లి అడవిరాజులబాబుకు సమర్పించారు. ఈ సందర్భంగా లవకుశల ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో గిరిజనులు, గిరిజనేతరులు, పలుగ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని సందడి చేశారు. పలుసాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మరెక్కడాలేని విధంగా లవకుశలకు గ్రామంలో ఆలయం నిర్మించి పూజించడం ఇక్కడ ఆనవాయితీ. విశేషాలంకరణలో ఉన్న లవకుశలను వేలాది మంది భక్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు చలమయ్య, వెంకటేశ్వరరావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నేతలు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక 1వ వార్డులో శుక్రవారం పార్టీ శ్రేణులతో వారు సమావేశం నిర్వహించారు. వచ్చే అంసెబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు పని చేయాలన్నారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ నాయకత్వంలో కలిసికట్టుగా పని చేసి సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఇతర పార్టీల ప్రలోభాలకు లొంగకుండా వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తొండరపు రాంబాబు, సుంకర రాంబాబు, వాగు బలరామ్, దాకమర్రి లోవరాజు, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు పరారైన విద్యార్థులు



తుని రైల్వే స్టేషన్‌లో పట్టుబడిన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు ఏపీ బాలయోగి గురుకుల బాలురు పాఠశాల నుంచి పరారైన విద్యార్థులు ఎట్టకేలకు తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా చేరుకున్నారు. గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వీప్సాక అఖిల్, తానాడ నానిదుర్గ, కొంగు చరణ్ తేజ, కడిమిపల్లి సుధీర్, తిరగాటి దినేష్‌కార్తిక్ ఈ నెల 9న వసతి గృహం నుంచి పరారయ్యారు. దీనిపై ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సామ్లా నాయక్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాలతో రూరల్ ఎస్సై ఎ.బాలాజీ, రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి విశాఖపట్నం నుంచి వస్తూ విద్యార్థులు తుని రైల్వే స్టేషన్‌లో దిగారు. విద్యార్థులను గమనించిన గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ ఆధ్వర్యంలో జీఆర్పీ హెచ్‌సీ జి.మోహన్‌రావు, సిబ్బంది పట్టుకున్నారు. బాలయోగి గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులమని చెప్పడంతో ఐదుగురిని రూరల్ పోలీసులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్సై అబ్దుల్ మారూఫ్ తెలిపారు. పరారై గొల్లప్రోలు, పిఠాపురం నుంచి విశాఖపట్నం వెళ్లి తిరిగివచ్చినట్టు విద్యార్థులు చెప్పారు. దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ వహించిన రూరల్ సీఐ సన్యాసిరావు, తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు బాలాజీ, స్వామినాయుడులను ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు అభినందించారు.